సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం ౹ 6 ౹ డిసెంబర్ ౹ 2023



కోతకు గురైన తీరం

మిచాంగ్ తుఫాన్ తీవ్రతకు బోగోలు మండలం తాటిచెట్లపాళెం వద్ద సముద్రం ముందుకు చొచ్చుకురావడంతో తీరం భారీగా కోతకు గురైంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా) -	రూ.64,460
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) -	రూ.5,795
3 శాతం జీఎస్టీతో.. -	రూ.5,969
నవర (8 గ్రా) -	రూ.47,752

వాతావరణం

గరిష్టం/కనిష్టం
25.5 /22.5

మంగళవారం గాలిలో తేమ 92 శాతం ఉంది. జిల్లాలో పలుచోట్ల చిరుజల్లులు కురిశాయి. బుధవారం కూడా జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

సహాయక చర్యలపై దృష్టి సారించండి

• కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): మిచాంగ్ తుఫాన్ సహాయక చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులకు సూచించారు. అన్ని మండల, మున్సిపల్ బృందాలు సహాయ కేంద్రాల పనితీరును నిర్ధారించాలన్నారు. కూలిన చెట్లన్నింటినీ తొలగించాలని, విద్యుత్ శాఖ సమన్వయంతో అన్ని వార్డుల్లో గ్రామాల్లో విద్యుత్ సరఫరా, లైన్లు, విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టాలని తెలిపారు. తాగునీరు అందించడం తదితర ఏర్పాట్లపై దృష్టి సారించాలన్నారు. చెట్లు పడిపోయిన ప్రభావిత గ్రామ పంచాయతీలు, వార్డుల సంఖ్య, వరద ప్రవాహం కారణంగా ప్రభావితమైన గ్రామాలు, విద్యుత్ సరఫరా లేని ప్రాంతాల నివేదికను సిద్ధం చేయాలని, డివిజన్ స్థాయి అధికారుల నేతృత్వంలో అన్ని మండల, మున్సిపల్ అధికారులు ఒక బృందంగా పనిచేయాలని సూచించారు. సబ్ కలెక్టర్లు, ఆర్డీఓలు, డీఎల్‌డీఓలు, డీఎల్‌పీఓలు మండల, మున్సిపల్ టీంలతో కార్యకలాపాలను సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.

జిల్లాలో 164.7 మి.మీ. సగటు వర్షపాతం

నెల్లూరు(దర్గామిట్ట): మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు మంగళవారం సగటున 164.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లాలోని దాదాపు 34 మండలాల్లో 100 మి.మీ.లకు పైగా వర్షపాతం నమోదు కావడం గమనార్హం. గరిష్టంగా మనుబోలు మండలంలో 317.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. సైదాపురంలో 283.2 మి.మీ., నెల్లూరు అర్బన్‌లో 254.6, పొదలకూరు మండలంలో 234.6, వెంకటాచలంలో 227.8, సంగంలో 220.6, నెల్లూరు రూరల్‌లో 214.4, రాపూరులో 213.8, ముత్తుకూరులో 210.4, అనంతసాగరంలో 195.8, ఆత్మకూరులో 193.2, కలువాయిలో 192.8, బుచ్చిరెడ్డిపాళెంలో 192.4, దగదర్తిలో 174.6, జలదంకిలో 163.8, తోటపల్లిగూడూరులో 163.2, ఇందుకూరుపేటలో 161.2, అల్లూరులో 158.6, కొడవలూరులో 154.2, కోవూరులో 152.8, విడవలూరులో 152.6, మర్రిపాడులో 147.6, కలిగిరిలో 147.2, కావలిలో 142.2, చేజర్లలో 139.4, కొండాపురంలో 137.2, వింజమూరులో 136.6, అనుమసముద్రంపేటలో 132.4, ఉదయగిరిలో 128.4, లింగసముద్రంలో 122.2, ఉలవపాడులో 121.8, బోగోలులో 115.2, కందుకూరులో 106.6, గుడ్లూరు మండలంలో 106.6 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

సోమశిలకు 10,915 క్యూసెక్కుల వరద

• 30.756 టీఎంసీల నీటి నిల్వ

సోమశిల: మిచాంగ్ తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలతో సోమశిల జలాశయానికి భారీగా వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. మంగళవారం జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి 10,915 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. దీంతో జలాశయ నీటిమట్టం 30.756 టీఎంసీలకు చేరుకుంది.



నెల్లూరులో మహిళను సురక్షితంగా తరలిస్తూ..



కసుమూరు పునరావాస కేంద్రంలో సూచనలిస్తున్న మంత్రి కాకాణి



అనంతసాగరంలో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



కలిగిరి: వెలగపాడు వద్ద వాగును పరిశీలిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు



రైతులతో మాట్లాడుతున్న తుఫాన్ పరిశీలన జిల్లా ప్రత్యేక అధికారి హరికిరణ్

• తుఫాన్ పరిశీలన జిల్లా ప్రత్యేక అధికారి

నెల్లూరు: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో నెల్లూరు నగరంలో దెబ్బతిన్న విద్యుత్ సరఫరాను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నట్లు తుఫాన్ పరిశీలన జిల్లా ప్రత్యేక అధికారి హరికిరణ్ తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి నగరంలోని పలు ప్రాంతాల్లో కలెక్టర్ ఎం.హరినారాయణన్, మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్‌లతో కలిసి పర్యటించిన ఆయన విద్యుత్ పునరుద్ధరణ పనులను పరిశీలించారు. సోమవారం అర్ధరాత్రి జిల్లాకు చేరిన ఆయన కలెక్టర్‌తో సమావేశమై తుఫాన్ ప్రభావాన్ని ఎదుర్కోవడంపై చర్చించారు. మంగళవారం ఉదయం నుంచి నెల్లూరు నగరంలోని కేవీఆర్ పెట్రోల్ బంక్, ఆత్మకూరు బస్టాండ్, విజయమహల్ గేట్, మాగుంట లేఅవుట్ వద్దనున్న అండర్ పాస్ బ్రిడ్జిలు, రామ్మూర్తినగర్ మున్సిపల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సహాయ పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న ఇతర రాష్ట్రాల వారితో మాట్లాడారు. శిబిరంలోని వారు మాట్లాడుతూ నగరంలో జీవనోపాధి కోసం వచ్చిన తమను గుర్తించి ఆదుకుంటున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సర్వేపల్లి రిజర్వాయర్‌ను, కనుపూరు చెరువును, నీటమునిగిన పంట పొలాలను, వెంకటాచలం మండలం కులతీగలపాడు గ్రామం వద్ద, సౌత్ మోపూరు వద్ద గండిపడిన కనుపూరు కాలువను పరిశీలించి స్థానిక రైతులతో మాట్లాడారు. జిల్లాలో తుఫాన్ తీవ్రతను ఎదుర్కొనేలా ముందస్తు చర్యలు పకడ్బందీగా చేపట్టడం వల్ల ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదన్నారు. ఒక్క రాత్రిలోనే తీవ్రంగా నష్టపోయిన నెల్లూరు నగరంలో వేగవంతంగా పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సహాయ శిబిరాల్లో ఉన్న వారికి మంచి భోజన వసతితోపాటు ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి కుటుంబానికి రూ.2,500, వ్యక్తులకు రూ.1,000 చొప్పున అందజేస్తామని తెలిపారు. వ్యవసాయానికి సంబంధించి జిల్లాలో నారుమడులు దెబ్బతిన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద విత్తనాలు అందిస్తామని తెలిపారు. నష్టపోయిన వారిని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని తెలిపారు.

విద్యుత్ సంస్థకు రూ.10 కోట్ల నష్టం

• ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో విద్యుత్ సంస్థకు రూ.10 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు తెలిపారు. నగరంలోని డైకస్‌రోడ్డు, పొదలకూరు రోడ్డు, వేదాయపాళెం, రామ్మూర్తినగర్, తెలుగుగంగ సబ్‌స్టేషన్‌లతోపాటు కావలి, ఇందుకూరుపేట, గూడూరు ప్రాంతాల్లో ఆయన స్వయంగా విద్యుత్ పునరుద్ధరణ పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు, చిత్తూరు, వైఎస్సార్ జిల్లాల్లో విద్యుత్ సంస్థకు మొత్తం రూ.13 కోట్ల మేర నష్టం వాటిల్లితే, ఒక్క నెల్లూరు జిల్లాలోనే రూ.10 కోట్ల మేర నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా ద్వారా తెలిసిందన్నారు. మొత్తం 100 ప్రత్యేక టీంలు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం తీవ్రంగా శ్రమిస్తున్నాయని తెలిపారు. తొలి ప్రాధాన్యంగా గృహ అవసరాలు, ఆస్పత్రులు, తాగునీటి సరఫరాకు విద్యుత్ సరఫరా ఇచ్చేలా ఆదేశించినట్లు తెలిపారు. నెల్లూరు, చిత్తూరు, వైఎస్సార్ జిల్లాల్లోని పలు పట్టణాలు, 1,119 గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని అన్నారు. 33 కేవీ సబ్‌స్టేషన్లు 305, 184 ఫీడర్లు, 11 కేవీ ఫీడర్లు 1,220 మరమ్మతులకు గురయ్యాయని తెలిపారు. 33 కేవీ లైన్ల విద్యుత్ స్తంభాలు 835, 11 కేవీ విద్యుత్ స్తంభాలు 3,272, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఒకటి, 1,268 డిస్ట్రిబ్యూషన్లు దెబ్బతిన్నాయని తెలిపారు. 123 కిలోమీటర్ల మేర విద్యుత్ లైన్లు తెగిపోయాయన్నారు. విద్యుత్ స్తంభాలు, లైన్లు దెబ్బతిన్న చోట చర్యలు చేపట్టేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 1912, కాల్‌సెంటర్ 18004251553333, వాట్సాప్ నంబర్ 91333 31912కు సమాచారం అందించాలని కోరారు. అనంతరం విద్యుత్ భవన్‌లో ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ కె.చక్రధర్‌బాబుతో కలిసి విద్యుత్ పునరుద్ధరణ చర్యలపై చర్చించారు.



విద్యుత్ పునరుద్ధరణపై ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ చక్రధర్‌బాబుతో చర్చిస్తున్న సీఎండీ



నెల్లూరులో ఆర్టీసీ బస్సుపై కూలిన విద్యుత్ స్తంభం



మాగుంటలేఅవుట్‌లో రోడ్డుపై కూలిన వృక్షం



వింజమూరులో దెబ్బతిన్న అరటితోట

అప్రమత్తతతో ప్రాణ నష్టం జరగలేదు



దగదర్తి-చెన్నూరు రహదారిని పరిశీలిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

కావలి: మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ముందస్తుగా చేపట్టిన అప్రమత్తత చర్యల వల్ల ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం జరగలేదని, కాలువలకు, చెరువులకు పడిన గండ్లకు, కోతకు గురైన రహదారులకు ఎఫ్‌డీఆర్ నిధులతో మరమ్మతులు చేపడతామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కావలి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పర్యటించారు. తొలుత దగదర్తి - చెన్నూరు మార్గంలో కోతకు గురైన రహదారిని పరిశీలించారు. బోగోలు మండలం రామస్వామిపాళెంలో నీట మునిగిన ఎస్టీకాలనీ వాసులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. పునరావాస కేంద్రానికి తరలించి ఆహారం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో అన్ని సహాయక చర్యలు కొనసాగించేలా జిల్లా యంత్రాంగానికి ఆదేశాలిచ్చామన్నారు. కొంత మేర వరినార్లు నీట మునిగాయని, ఉద్యాన పంటలు స్వల్పంగా దెబ్బతిన్నాయని, వరి నార్లు దెబ్బతిన్న రైతులకు వెంటనే విత్తనాలను సబ్సిడీపై అందజేస్తామని, అన్నదాతలను ఆదుకుంటామని తెలిపారు. పునరావాస కేంద్రాల్లోని ఒక్కో కుటుంబానికి రూ.2,500, ఒక్కొక్కరికి రూ.1,000 అందించాలని ముఖ్యమంత్రి ఆదేశాలిచ్చారని తెలిపారు. ఇళ్ల నీట మునిగిన ప్రాంతాల్లో ప్రజలకు ఉచితంగా 25 కేజీల బియ్యం, పామాయిల్ ప్యాకెట్, కేజీ కందిపప్పు, కేజీ ఉల్లిపాయలు, కేజీ ఉర్లగడ్డల చొప్పున ప్రతి కుటుంబానికి అందించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దెబ్బతిన్న విద్యుత్ లైన్లను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ పునరావాస కేంద్రాల్లో బాధితులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. వారి వెంట జేసీ కూర్మనాథ్, కావలి ఆర్డీఓ శీనానాయక్, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు ఉన్నారు.



నెల్లూరులో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తూ..



సంగం: పునరావాస కేంద్రంలో ఆర్డీఓ మధులత



నెల్లూరులో కూలిన చెట్టును తొలగిస్తూ..

ఒక్కో మండలానికి రూ. 60 లక్షలు



- సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు నిధులు
- రూ.23.63 కోట్లతో ఇంప్యాక్ట్ రోడ్లు
- రూ.56.58 కోట్లతో గ్రామీణ రహదారులు
- మూడు బ్రిడ్జిల నిర్మాణానికి టెండర్లు

నెల్లూరు(పొగతోట): గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు, గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు మండలానికి రూ.60 లక్షలు మంజూరు చేసింది. రూ.22.20 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించనున్నారు. దీనికి సంబంధించి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇంప్యాక్ట్ రోడ్లకు రూ.23.63 కేటాయించారు. వీటికి టెండర్లు ఆహ్వానించి పనులు ప్రారంభించేలా పంచాయతీరాజ్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రూ.21.77 కోట్లతో మూడు ప్రాంతాల్లో బ్రిడ్జిలు నిర్మించనున్నారు. రూ 56.58 కోట్లతో 8 ప్రాంతాల్లో నూతన రోడ్లను నిర్మించనున్నారు. జిల్లాలోని 37 మండలాల్లో అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆయా నియోజకవర్గాల శాసనసభ్యుల సూచనల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మురుగునీరు రోడ్లపై ప్రవహించకుండా, వర్షాలు పడినా ప్రజలు ఇబ్బందులు పడకుండా సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నారు. నిధులు అందుబాటులో ఉండడంతో పనులు ప్రారంభించేలా పంచాయతీరాజ్ అధికారులు చర్యలు చేపట్టారు. దగదర్తి, పొదలకూరు, రాపూరు మండలాల్లో రూ.21.77 కోట్లతో మూడు బ్రిడ్జిలు నిర్మించనున్నారు. ఆత్మకూరు, పొదలకూరు, రాపూరు, వెంకటాచలం, ఉదయగిరి తదితర మండలాల్లో రూ.56.58 కోట్లతో నూతన రోడ్లను నిర్మించనున్నారు. రోడ్ల నిర్మాణాలను త్వరగా చేపట్టి పూర్తి చేసేలా పంచాయతీరాజ్ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన ద్వారా 2020–21లో రూ.67 కోట్లతో 13 రోడ్లు, రూ.7.89 కోట్లతో 12 రోడ్లకు నిధులు మంజూరు చేశారు. 13 రోడ్లు పూర్తయ్యాయి. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన ద్వారా 2023–24లో 8 రోడ్లు మంజూరు చేశారు. ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్డు ప్రాజెక్టు ద్వారా రూ.316 కోట్లతో 196 పనులు చేపట్టారు. 157 పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయి. గ్రామ సచివాలయాలు, విలేజ్ క్లినిక్స్, రైతు భరోసా కేంద్రాలు తదితర భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. కొత్త రోడ్లకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు చేపట్టి త్వరగా పూర్తి చేసేలా పంచాయతీరాజ్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

టెండర్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేస్తాం



ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో ప్రతి మండలంలో రూ.60 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకున్నాం. 13 రోడ్లు, 3 బ్రిడ్జిల నిర్మాణాలకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. టెండర్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

– శివారెడ్డి, పంచాయతీరాజ్ ఎస్‌ఈ

తుఫాన్‌ను దీటుగా ఎదుర్కొని..

• ముమ్మరంగా సహాయక చర్యలు



నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో మిచాంగ్ తుఫాన్ హెచ్చరిక ప్రకటించిన వెంటనే జిల్లా యంత్రాంగం అప్రమత్తం కావడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. సహాయక, పునరావాస చర్యలపై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ సంబంధిత అధికారులకు ఆదేశాలిస్తూ ముందస్తు చర్యలు చేపట్టారు. పురపాలక, పంచాయతీరాజ్, రెవెన్యూ, పోలీసు తదితర శాఖల అధికారులు సమర్థవంతంగా పనిచేసి లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి వారికి భోజనం, తాగునీరు తదితర వసతులు కల్పించారు. భారీ వర్షాలు, ఈదురుగాలులకు కూలిన చెట్లు, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను తొలగించి యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు. మిచాంగ్ తుఫాన్ వల్ల జిల్లాలో దెబ్బతిన్న ప్రాంతాల్లో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, తుఫాన్ పరిశీలన జిల్లా ప్రత్యేక అధికారి హరికిరణ్, కలెక్టర్ ఎం.హరినారాయణన్ పర్యటించి సహాయక, పునరావాస చర్యలను పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా సుమారు 3,500 హెక్టార్లలో వరి నారుమడులు దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. నెల్లూరు నగరంలోని నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి పెన్నా బ్యారేజీకు భారీ స్థాయిలో వరద ప్రవాహం వచ్చి చేరుతుండడంతో మంగళవారం నగరవాసులు బ్యారేజ్ వద్దకు చేరుకుని వీక్షించారు.

అధికారులు ఉదారంగా వ్యవహరించండి



పునరావాస కేంద్రంలో చిన్నారులకు బిస్కెట్లు అందజేస్తున్న మంత్రి కాకాణి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి

పొదలకూరు : మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందివ్వడంలో అధికారులు ఉదారంగా వ్యవహరించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరు జెడ్పీహైస్కూల్, శివాలయం వీధి పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను మంత్రి కాకాణి మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో నిమ్మతోటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా సమాచారం అందిందని, ఉద్యానాధికారులు పరిహారం అందించేందుకు ఎన్యుమరేషన్ చేపట్టే సమయంలో రైతులకు సహకారం అందించి ఉదారతను చాటుకోవాల్సిందిగా సూచించారు. జిల్లా, మండల స్థాయి అధికారుల సహకారంతో తుపాను వల్ల ప్రాణనష్టం కలుగకుండా చర్యలు తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారని, బాధితులను ఆదుకునేందుకు అన్నిరకాల చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించినట్లు తెలిపారు. పునరావాసంలో ఉన్న వారిని కుటుంబానికి రూ.2,500, ఒక్కరికైతే రూ.1000 అందజేయాల్సిందిగా సూచించారు. ఇళ్లలోకి వర్షపు నీరు వచ్చిన వారికి 25 కిలోల బియ్యం, కేజీ కందిపప్పు, పామాయిల్ ప్యాకెట్, ఆలుగడ్డలు అందజేయాల్సిందిగా తహసీల్దార్‌ను ఆదేశించారు. కాలనీల్లో సిమెంటురోడ్లు, సైడ్‌డ్రెయిన్లు పెద్ద ఎత్తున నిర్మించడం వల్ల చాలావరకు ఇళ్లలోకి వర్షపు నీరు రాలేదన్నారు. మంత్రి వెంట తహసీల్దార్ కె.వీరవసంతరావు, ఎంపీడీఓ నగేష్‌కుమారి, ఏఈలు కసనానాయక్, శివమోహన్, డాక్టర్ కావ్య, నాయకులు కోనం చినబ్రహ్మయ్య, వాకాటి శ్రీనివాసులురెడ్డి, శేఖర్‌బాబు, అంజాద్, మద్దిరెడ్డి రణారెడ్డి, జి.శ్రీనివాసులు, శివశంకర్ ఉన్నారు.

ఎవరూ అధైర్య పడొద్దు

- ప్రభుత్వం అండగా ఉంటుంది
- ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు : తుపాను బాధితులెవరూ అధైర్య పడొద్దని, రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి భరోసా కల్పించారు. కోవూరు మండలంలో మంగళవారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. తొలుత పాటూరు, పోతిరెడ్డిపాళెం, ఇనమడుగు గ్రామాల్లో లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు చేర్చారు. అవసరమైన సౌకర్యాలు కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. స్థానిక యువత, ప్రజల సమన్వయంతో తుపాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నట్లు వెల్లడించారు. అలాగే గిరిజన కుటుంబాలకు చెందిన వారు చేపలు పట్టేందుకు వెళ్లే సమయంలో పిల్లలను తీసుకెళ్లి ఇబ్బందులు పడవద్దని సూచించారు. కష్టకాలంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండి స్థానిక నాయకుల సహకారంతో జరిగిన నష్టాన్ని నివారించాలన్నారు. ప్రజలు కూడా అధికారులు, నాయకులకు సహకరించాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లాల్సి వస్తే నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఆయన వెంట డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, తహసీల్దార్ పద్మజ, ఎంపీడీఓ శ్రీహరి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ ప్రసాద్, పార్టీ నేతలు అనూప్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, చిరంజీవి, వసంతకుమార్‌రెడ్డి, మల్లికార్జున్, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



పునరావాస కేంద్రంలోని వారితో మాట్లాడుతున్న కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బాధితులందరికీ ప్రభుత్వ భరోసా



ఆత్మకూరు చెరువు వద్ద రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు : తుపాను బాధితులందరికీ రాష్ట్ర ప్రభుత్వం భరోసాగా నిలుస్తోందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని చెరువును ఆయన స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి మంగళవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా అధిక వర్షపాతం నమోదైందని తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా నియోజకవర్గంలో 12 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి లోతట్టు ప్రాంత ప్రజలను తరలించినట్లు తెలిపారు. పంట నష్టం వివరాలను సేకరించి సత్వరమే చర్యలు తీసుకునే విధంగా ఆదేశాలు జారీ చేసి ఉన్నారని, ఈ మేరకు బాధిత రైతులు అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ వర్షాల కారణంగా సోమశిల జలాశయంతో పాటు సంగం బ్యారేజీకి నీరు చేరిందని, ఆత్మకూరు వంటి చెరువులు జలకళను సంతరించుకున్నాయని తెలిపారు. పట్టణంలోని తమ క్యాంపు కార్యాలయంలో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. నియోజకవర్గంలో సంగం, చేజర్ల మండలాల్లో వర్షం వల్ల ఎక్కువ నష్టం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సహాయ చర్యల్లో ముమ్మరంగా పాల్గొన్న ఆర్డీఓ మధులతను ఎమ్మెల్యే అభినందించారు. ఆయన వెంట కమిషనర్ బి.నాగేశ్వరరావు, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, చైర్‌పర్సన్ వెంకట రమణమ్మ, వైస్ చైర్మన్లు డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, కౌన్సిలర్లు, పార్టీ నేతలు నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, నందవరం ప్రసాద్, ముజీబ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పూచీకత్తు లేని రుణ పెంపు వాస్తవమేనా?

- పార్లమెంట్‌లో ఎంపీ వేమిరెడ్డి



నెల్లూరు : రైతులకు అందజేసే కిసాన్ క్రెడిట్ కార్డుల విషయమై రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మంగళవారం పార్లమెంట్‌లో పలు ప్రశ్నలు అడిగారు. కిసాన్ క్రెడిట్ కార్డు కింద రైతులకు పూచీకత్తు లేని రుణాన్ని రూ.1.6 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు పెంచడం, కేసీసీ కింద తీసుకున్న రుణానికి ఏడు శాతం వడ్డీ వసూలు చేయడం వాస్తవమేనా అని ప్రశ్నించారు. దీనిపై కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ భగవత్ కరద్ సమాధానమిచ్చారు. కిసాన్ క్రెడిట్ కార్డు కింద రైతులకు పూచీకత్తు లేని రుణాన్ని పెంచడంపై ఎలాంటి ప్రతిపాదనలు అందలేదని తెలిపారు. ఆర్‌బీఐ ప్రకారం గతేడాది నవంబర్ 23 నుంచి కిసాన్ క్రెడిట్ కార్డు కింద రైతులకు బ్యాంకులు 7 శాతం వడ్డీ అమలు చేస్తున్నట్లు చెప్పారు.

సహాయక చర్యలను వేగవంతం చేయండి

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరురూరల్ : గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రూరల్ నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న సహాయక చర్యలను వేగవంతం చేయాలని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నగరంలోని వైఎస్సార్ నగర్, తల్పగిరి కాలనీ, ఆర్టీసీ కాలనీ, ఇందిరమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో జోరు వర్షంలోనూ ఎంపీ ఆదాల మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ వరద నీటిని మళ్లించే విధంగా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఆయన వెంట నగర మేయర్ స్రవంతి, కమిషనర్ వికాస్‌మర్మత్, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, పలువురు కార్పొరేటర్లు, పార్టీ డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

పోలీసుల అప్రమత్తత

పొట్టెపాళెం, ములుముడి గ్రామాల వద్ద ఉన్న చెరువు కలుజులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు పహారా కాశారు. వాహన చోదకులకు, పాదచారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కలుజు ప్రవాహం నుంచి గట్టుకు చేర్చారు.

సౌత్‌మోపూరులో..

రూరల్ మండలంలోని సౌత్‌మోపూరులో కనుపూరు కెనాల్, పెద్దతూమునకు గండి పడడంతో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, పలువురు ఇరిగేషన్ అధికారులు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. స్థానిక రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు.



వరద ప్రభావిత ప్రాంతాల్లో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

ఇబ్బందుల్లేకుండా సౌకర్యాల కల్పన



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ తెలిపారు. నగర నియోజకవర్గంలోని వర్ష ప్రభావిత ప్రాంతాలైన 42వ డివిజన్ మన్సూర్‌నగర్, ఖుద్దూస్‌నగర్, 48వ డివిజన్ పార్లు కట్ట, 6వ డివిజన్ ఉడ్‌హౌస్ సంఘం, 8వ డివిజన్ సీఆర్పీ డొంక, కామాటి దళితవాడ, 10వ డివిజన్ ఉస్మాన్‌సాహెబ్‌పేట, కోదండరామపురం, 16వ డివిజన్ గుర్రాలమడుగు సంఘం, 9వ డివిజన్ కుసుమ దళితవాడ తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలకు భోజన సదుపాయాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా మంచినీటి సరఫరా, విద్యుత్ సరఫరా త్వరితగతిన అందించాలని అధికారులను ఆదేశించారు. వర్ష ప్రభావిత ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానిక కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నేతలకు సూచించారు. టీడీపీ నాయకులు ప్రజలకు సేవ చేయడం మానేసి రాజకీయాలు మాట్లాడడం మంచి పద్ధతి కాదన్నారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సహాయక చర్యల్లో పాల్గొని ప్రజలకు సేవ చేశామే తప్ప విమర్శలు చేయలేదన్నారు.

కలిచేడు చెరువుకు గండి



పూర్తిగా నిండిన సైదాపురం చెరువు

గూడూరు– సైదాపురం– పొదలకూరు మార్గాల్లో రాకపోకలు బంద్

సైదాపురం : మిచాంగ్ తుపాన్ ప్రభావంతో సైదాపురంలో కుండపోత వర్షం కురిసింది. దీంతో కలిచేడు చెరువుకు గండి పడింది. అంతే కాకుండా సైదాపురం సమీపంలో కైవల్యా నది, కమాన్ నీటి వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సైదాపురం–గూడూరు మార్గంలో గత రెండు రోజులుగా రాకపోకలు స్తంభించాయి. అలాగే తురిమెర్ల వద్ద పిన్నేరు, ఊటుకూరు వద్ద మాలేరు, శమాయిన్ వద్ద సిద్దలవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సైదాపురం–పొదలకూరు రాకపోకలు కూడా స్తంభించాయి. కలిచేడు చెరువుకు గండి పడడంతో నీరు వృథాగా పోయింది. మండలంలోని సైదాపురం, తలుపూరు, అనంతమడుగు, రామసాగరం, ఊటుకూరు, తురిమెర్ల, చీకవోలు, లింగసముద్రం, తిప్పిరెడ్డిపల్లి, వేమలచేడు, కొమ్మిపాడు, ఆర్‌వైపాళెం చెరువుల్లోకి నీరు పుష్కలంగా రావడంతో కలుజులు పారుతున్నాయి. కైవల్యానది పొర్లు కట్టలు ప్రవహించడంతో వేమనచేడు, పాలూరు, అనంతమడుగు, వెంకటరెడ్డిపల్లి, కమ్మవారిపల్లి, రామసాగరం వద్ద పొలాలు నీట మునిగాయి. సుమారు 25 ఎకరాల బొప్పాయి పంట నీట మునిగింది. విపరీతమైన గాలులతో నిమ్మచెట్లు దెబ్బతిన్నాయి. ఇప్పటి వరకు 150 విద్యుత్ స్తంభాలు నేలకొరగ్గా, 20 ట్రాన్స్‌ఫార్మర్లు కొట్టుకుపోవడంతో విద్యుత్‌శాఖకు సుమారు రూ.40 లక్షల నష్టం వాటిల్లినట్లు ఏఈ శేషాద్రి తెలిపారు.

చిట్వేలి ఘాట్ మూసివేత

రాపూరు: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో చిట్వేలి సమీపంలోని అనుంపల్లి వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రాపూరు–చిట్వేలి మధ్య రాకపోకలు నిలిచిపోయింది. మంగళవారం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా కొండేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రజలు చూసేందుకు తరలివెళ్లారు.



రాపూరు–చిట్వేలి మార్గంలో చెక్‌పోస్టు మూసివేత



ఉధృతంగా ప్రవహిస్తున్న సైదాపురం కలుజు



రాపూరు సమీపంలో ఉధృతంగా కొండేరు వాగు

జనజీవనానికి ఆటంకం లేకుండా చూడాలి



పోలీసులకు సూచనలు చేస్తున్న ఎస్పీ

- ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి

ఇందుకూరుపేట : తుపాను కారణంగా జనజీవనానికి ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మైపాడు సముద్ర తీర ప్రాంతాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికులు, అధికారులతో మాట్లాడుతూ అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలన్నారు. వాగులు, వంకలు, నదులు పొంగి పొర్లుతున్నందున ఎలాంటి ప్రమాదం జరగకుండా, ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేస్తూ భద్రతను కట్టుదిట్టం చేస్తున్నామన్నారు. ఈదురు గాలులకు రోడ్లపై విరిగిపడే చెట్లను, కరెంట్ స్తంభాలను వెంటనే తొలగించి, ప్రయాణాలకు అంతరాయం కలుగకుండా చూడాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల వారిని పునరావాస కేంద్రాలకు తరలించి, తాగునీరు ఆహారం తదితర సదుపాయాలు అందించాలన్నారు. వృద్ధులు, చిన్న పిల్లలకు స్థానిక యువత సహాయ సహకారాలు అందించాలని కోరారు. అధిక నీటి ప్రవాహం ఉన్న రోడ్లు, బ్రిడ్జిలు, వాగులు, నదులు దాటడానికి ప్రయత్నం చేయవద్దన్నారు. ఎస్పీ వెంట సీఐలు రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వరరావు, స్థానిక ఎస్సై వీరేంద్రబాబు ఉన్నారు.

విద్యుత్ పునరుద్ధరణ పనుల పరిశీలన



విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న సీఎండీ సంతోషరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : మిచాంగ్ తుపాన్ సృష్టించిన నష్టానికి జిల్లాలో విద్యుత్ సంస్థ తీవ్రంగా నష్టపోయిన నేపథ్యంలో ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు నెల్లూరుకు చేరుకుని ఆ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నగరంలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న పలు ప్రాంతాల్లో మంగళవారం డీఎండీ స్వయంగా పర్యటించి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అధికారులు, సిబ్బంది యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుని విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నారు.

సరఫరాకు తీవ్ర అంతరాయం

మిచాంగ్ తుపాన్ ప్రభావంతో నగరంలో కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలులకు పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు తెగిపోవడం, స్తంభాలు పడిపోవడంతో పాటు 33 కేవీ ప్రధాన విద్యుత్ ఫీడర్ మరమ్మతులకు గురైంది. దీనివల్ల విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలు ప్రాంతాల్లో సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి నిలిచిపోయిన విద్యుత్ సరఫరా మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు రాకపోవడంతో ప్రజలు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పౌల్ట్రీ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	రూ.88
లేయర్ (లైవ్)	రూ.90
బ్రాయిలర్ చికెన్	రూ.166
స్కిన్‌లెస్ చికెన్	రూ.186
లేయర్ చికెన్	రూ.153

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	రూ.35
సన్నవి	రూ.20
పండ్లు	రూ.6

గుర్తుతెలియని వ్యక్తి మృతి

వెంకటాచలం : వెంకటాచలం రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం ఓ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సుమారు 40 ఏళ్ల వయసు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి వారం క్రితం మృతిచెంది ఉండొచ్చని పోలీసులు అంచనా వేస్తున్నారు. దీంతో మృతదేహం కుళ్లి దుర్వాసన వెదజల్లుతోంది. మృతుడు నల్ల రంగు ప్యాంటు ధరించి సుమారు 5.6 అడుగుల ఎత్తు కలిగి ఉన్నాడు. సమాచారం అందుకున్న సీఐ అంకమరావు తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఏమైనా ఆధారాలు లభిస్తాయని చుట్టుపక్కల గాలించారు. మృతుడు ఎలా చనిపోయాడన్నది తెలియాల్సి ఉంది. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కండలేరులో 12.520 టీఎంసీలు

రాపూరు : కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 12.520 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరదకాలువ నుంచి జలాశయానికి 10,350 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు.